క్లుప్తంగా

శుభాకాంక్షలు



మణికొండ: చిన్న జీయర్ స్వామికి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషన్ అవార్డును ప్రకటించిన నేపథ్యంలో గండిపేట కౌన్సిలర్ గోపాల సునీత గణేష్ సోమవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శంషాబాద్‌లోని ఆశ్రమంలో స్వామీజీని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. రాబోయే రోజుల్లో ఆయన మరిన్ని ఉన్నత అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



సీసీ రోడ్డు పనులను ప్రారంభించిన కౌన్సిలర్ లక్ష్మీ ప్రవళిక కిరణ్

మణికొండ: ప్రజల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని నార్సింగి మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్ అన్నారు. సోమవారం తన వార్డులో రూ. 20 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలోనే తన వార్డుగా ఆదర్శంగా నిలిపేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నామన్నారు. అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి సేవ చేయటమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కోకాపేట కౌన్సిలర్ దుర్గేష్‌యాదవ్, సీనియర్ నాయకుడు వేణుగౌడ్, నాయకులు మహేందర్‌గౌడ్, శ్రీకాంత్, స్థానికులు ఆనంద్, వలీ,మజర్, శ్రీపాద, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శన



మణికొండ: నార్సింగ్ మెయిన్‌రోడ్‌లోని సుందర గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కళా సిల్క్ చేనేత హస్తకళా ప్రదర్శనకు విశేష స్పందన లభిస్తోంది. ఈ ప్రదర్శనలో దేశంలోని అన్ని రకాల చేనేత కళాకారులు రూపొందించిన కాటన్ చీరలు, చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచారు. ఈ ఎగ్జిబిషన్ ద్వారా కొనుగోలుదారులకు నాణ్యమైన వస్తువులు అందిస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా 65 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్లు నిర్వాహకులు వినోద్ తెలిపారు.

నార్సింగి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీసీపీ



డీసీపీ జగదీశ్వర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న సీఐ శివకుమార్

మణికొండ: రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి సోమవారం నార్సింగి పాత, కొత్త పోలీస్‌స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జోన్ పరిధిలో కొత్తగా ఏర్పడిన కొల్లూరు, మోకిల, సీఐలు, నార్సింగి, శంకర్‌పల్లి సీఐలతో ఆయా స్టేషన్ల పరిధి, భవనాలు తదితర అంశాలపై చర్చించారు. సోమవారం నుంచి నార్సింగి పోలీస్‌స్టేషన్ రాజేంద్రనగర్ జోన్ పరిధిలో చేరడం, మొదటి రోజే డీసీపీ స్థాయి అధికారి సందర్శనకు రావటంతో పోలీస్ స్టేషన్ సిబ్బంది అప్రమత్తమయ్యారు.

ఘన స్వాగతం

కాళీ మందిర్ వార్షికోత్సవానికి హాజరైన హోంమంత్రి



శంషాబాద్ రూరల్: కవ్వగూడ శివారులోని బెంగాలీ స్వర్ణ శిల్పి కాళీ మందిర్ మూడో వార్షికోత్సవానికి సోమవారం రాష్ట్ర హోంమంత్రి మహమ్మద్ అలీ హాజరయ్యారు. నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ విశిష్టతను వివరించారు.

మహాత్ముని అడుగుజాడల్లో నడవాలి



శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్





మహాత్మాగాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, వాసవీక్లబ్ ప్రతినిధులు



మహాత్మగాంధీకి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు అబ్రెశి సదాలక్ష్మి తదితరులు



బుద్వేల్‌లో..



హైదర్‌గూడలో..

బండ్లగూడ: మహాత్మా గాంధీ సిద్ధాంతాలను అర్థం చేసుకుని ప్రతిఒక్కరూ ఆయన అడుగు జాడల్లో నడవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం హైదర్షాకోట్‌లోని కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక సంస్థ, అంతర్ భారతి ట్రస్ట్ సంయుక్తంగా శాంతి యాత్రను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మేయర్ మహేందర్‌గౌడ్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా కస్తూర్బా జాతీయ స్మారక సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. మహాత్మా గాంధీ అడుగు జాడల్లో నేటి యువత నడవాలన్నారు. కార్యక్రమంలో నార్సింగిఎస్సై సతీష్, కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి, కస్తూర్బా గాంధీ జాతీయ స్మారక సంస్థ ప్రతినిధి పద్మావతి, అంతర్ భారతి ట్రస్ట్ ప్రతినిధి సంగీత దేశముఖ్, మనీషారాణి, సందీప్ పాండే, శ్రోతపాండ్య, అమర్ హబీబ్, ట్రస్ట్ మేనేజర్ మూర్తి, శ్రీనివసరావు, లక్ష్మి, రుక్మిణి, తిరుమలరావు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీకి కాంగ్రెస్ నేతల నివాళి

శంషాబాద్ రూరల్: రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ముగింపును పురస్కరించుకుని సోమవారం మండలంలోని నర్కూడలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జ్ఞానేశ్వర్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మణికొండలో..

మణికొండ: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని గాంధీ విగ్రహానికి స్థానిక నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్, మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, నాయకులు డి. కిరణ్‌కుమార్, వేణుగౌడ్, వినోద్‌కుమార్, రాము, మణికొండ వాసవిక్లబ్ కపుల్స్ జిల్లా కోఆర్డినేటర్ ఈశ్వర్‌ప్రసాద్, జోనల్ చైర్మెన్ నవీన్‌కుమార్, అధ్యక్షుడు నిరీష, కార్యదర్శి వంశీకృష్ణ, కోశాధికారి రామ్ సురేస్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్‌లో..

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలలు వేసి నివాళులర్పించారు. బుద్వేల్‌లోని గాంధీ విగ్రహం వద్ద శ్రీనివాస సేవా సమితి వ్యవస్థాపకుడు పెండ్యాల సాయిమాలిక్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రగడంపల్లి శ్రావణ్, రాధాశ్యామ్, నరేష్, యాదయ్య, ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

హైదర్‌గూడలో..

అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడలోని మహాత్మ గాంధీ విగ్రహం వద్ద కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో కొలన్ సుభాష్‌రెడ్డి, మ్యాడం రామేశ్వర్‌రావు, బండారు రమేష్, కొలన్ సుధాకర్‌రెడ్డి, సోమారం రవీందర్, సోమారం రాజ్‌కుఆర్, సనివెల్లి శేఖర్‌రెడ్డి, చిట్టిగారి నరేందర్, కొంగళ్ల బుచ్చయ కొండమీది హరినాథ్, బాలు, చిత్తారీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి: అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ అన్నారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లిలోని తన కార్యాలయంలో జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశం నిర్వహించారు. కాటేదాన్‌లో జరుగుతున్న స్టేడియం పనులు, కాటేదాన్ మెయిన్ రోడ్డు, శాంతి నగర్‌లోని సీసీ రోడ్డు, డ్రైన్స్ పనులపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేపట్టాలన్నారు. పనుల నిర్వహనకు నిధుల కొరత లేదన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఈఈ నరేందర్‌గౌడ్, ఏఈ బల్వంత్‌రెడ్డి, జలమండలి డీజీఎం జమిల్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, రఘుయాదవ్, సరికొండ వెంకటేష్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష కేంద్రాల సందర్శనకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురంలోని సాయి గ్రామర్ హై స్కూల్ విద్యార్థులు హాంకాంగ్‌లోని అంతర్జాతీయ అంతరిక్ష పరిశోధన కేంద్రం సందర్శకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలక్ష్మి తెలిపారు. నాలెడ్జ్ ఆప్టిట్యూడ్ టెస్ట్(క్యాట్) ఫౌండేషన్ ఫౌండర్, డైరెక్టర్ డాక్టర్ మహమ్మద్ అన్వర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ దశల పరీక్షలలో 5వ తరగతి చదువుతున్న సుజల్‌సింగ్ టాప్ టెన్‌లో ర్యాంకు సాధించి హాంకాంగ్‌లోని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం సందర్శకు ఎంపికయ్యాడన్నారు. మరో ఇద్దరు విద్యార్థులు బి.వైష్ణవి, ఈ.సాయిరేవంత్ కోల్‌కతలోని అంతరిక్ష పరిశోధనా కేంద్రానికి ఎంపికైనట్లు తెలిపారు. వీరితో పాటు మరో 9 మంది బెంగళూరులోని ఇస్రో అంతరిక్ష కేంద్రం సందర్శనకు ఎంపిక కాగా, హైదరాబాద్ బిర్లా ప్లానిటోరియం సందర్శించడానికి మరో 9 మంది ఎంపికయ్యారు. మొత్తం 21 మంది విద్యార్థులు తమ పాఠశాల నుంచి అంతరిక్ష కేంద్రాలకు సందర్శనకు ఎంపికకావడం ఆనందంగా ఉందన్నారు. ఎంపికైన విద్యార్థులను క్యాట్ ఫౌండేషన్ సంస్థ ఉచితంగా ఆయా కేంద్రాలకు తీసుకెళ్లి అక్కడ జరిగే పరిశోధనలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఎంపికైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఏ.పి.చారి, శ్రీలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిలీ సంఘాలతో రుణాలు

- రిసోర్స్ పర్సన్ నిర్వాకం
- రెండు బ్యాంకుల్లో రూ. 30 లక్షల రుణం
- అధికారులతో మహిళల వాగ్వాదం



అధికారులతో మాట్లాడుతున్న పొదుపు సంఘాల మహిళలు

శంషాబాద్: మహిళా పొదుపు సంఘాలకు తెలియకుండా నకిలీ ఫోటోలు, ఫోర్జరీ సంతకాలతో ఓ రిసోర్స్ భారీగా బ్యాంకుల నుంచి రుణాలు కాజేసిన ఘటన పట్టణంలో వెలుగుచూసింది. పట్టణంలోని సప్తగిరి, రమ్యశ్రీ, శ్రీరామా, శ్రీ సాయిబాబా మహిళా సంఘాలు 2020లోనే లావాదేవీలను నిలిపివేశాయి. ఆయా సంఘాలకు సంబంధించిన లావాదేవీల లెక్కలు చూసే రిసోర్స్ పర్సన్ రత్న మాత్రం సదరు సంఘాల మహిళలకు తెలియకుండా వేరే మహిళల ఫొటోలు, నకిలీ సంతకాలతో బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంకుల నుంచి రూ. 30 లక్షలు పావలా వడ్డీ రుణాలను తీసుకుంది. ఇటీవల తమ పొదుపు సంఘాలను పునరుద్ధరించేందుకు బ్యాంకులకు వచ్చిన మహిళలకు మీ సంఘాల పేరున బ్యాంకులో రుణాలు తీసుకున్నట్లు అధికారులు చెప్పడంతో అవాక్కయ్యారు.

◆ బ్యాంకు ఎదుట ఆందోళన

అక్రమంగా రుణాలు తీసుకున్న సదరు రిసోర్స్ పర్సన్ బ్యాంకు వద్దకు తీసుకొచ్చిన మహిళలు అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ ప్రమేయం లేకుండా రుణాలు ఎలా జారీ చేస్తారని నిలదీశారు. 2021 మార్చిలో రుణాలు జారీ చేసిన అధికారులు ప్రస్తుతం ఇక్కడి శాఖల్లో పనిచేయడం లేదని ఈ విషయమై విచారణ చేపడతామని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు.

◆ అధికారుల ప్రమేయంతోనే రుణాలు

రుణాల మంజూరు ప్రక్రియ ఓ ప్రభుత్వ అధికారి ప్రమేయంతోనే జరిగిందని మహిళలు ఆరోపిస్తున్నారు. సదరు వ్యక్తి సంఘాలకు సంబంధించిన అంశాలను పూర్తిగా సరిచూసిన తర్వాతే రుణాల మంజూరు జరుగుతుందన్నారు. ఈ తెలిసినా ఎందుకు పట్టించుకోలేదని వారు ప్రశ్నించారు. బ్యాంకు అధికారులు సంఘాలకు సంబంధించిన మహిళలు లేకుండా రుణాలు ఎలా జారీ చేస్తారని ప్రశ్నించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసి దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



లక్ష్మిగూడలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. లక్ష్మిగూడలో డ్రైనేజీ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. భూగర్భ డ్రైనేజీ శిథిలావస్థకు చేరుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. త్వరలోనే పనులను ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవడంతో పాటు వాటిని సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో శరణమ్మ, టి.చిన్నా, అనసుజ, పూజ, సలీం, జీహెచ్‌ఎంసీ ఏఈ బల్వంత్‌రెడ్డి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి డీజీఎం వినాయక్, బస్తీ వాసులు పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు



కంటి వెలుగు కేంద్రాన్ని పరిశీలిస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ 2వ డివిజన్‌లోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కేంద్రాన్ని సోమవారం ఆయన కార్పొరేటర్ పద్మావతి పాపయ్యయాదవ్‌తో కలిసి పరిశీలించారు. వైద్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి కార్యక్రమంపై అవగాహన కల్పించాలని ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, తలారి పాండు, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి టిఎల్‌ఎం గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హిమాయత్‌నగర్ సెంటేనియా ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మాట్లాడుతూ పేదలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ దూసుకుపోతుందన్నారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎప్పుడు ముందుంటుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ మైలార్‌దేవ్‌పల్లి నూతన కమిటీని ఎన్నుకున్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలార్‌దేవ్‌పల్లి అధ్యక్షుడుగా బుచ్చిరెడ్డి, కమిటి సభ్యులుగా ఎల్.వి.రెడ్డి, కిషోర్, నర్సింహ్మారెడ్డి, రాజేష్‌షిండే, చంద్రరెడ్డి, లక్ష్మయ్య, కరుణాకర్‌రెడ్డి, శ్రీనునాయక్, రామయాదవ్, కృష్ణ, లక్ష్మినారాయణ, సుఖేందర్‌రెడ్డి, ఉత్తం, ఉదయ్, వల్లభ్, చంద్రయ్య, నరేష్, రాజ్‌కుమార్‌రెడ్డి, సి.శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి తదితరులు ఎన్నికయ్యారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

రాజేంద్రనగర్: భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా అత్తాపూర్ డివిజన్ పరిధిలోని దేవాలయాల్లో సోమవారం కాంగ్రెస్ నేతలు పూజలు చేశారు. డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముద్దగోని భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి పార్టీ సీనియర్‌నాయకుడు గోవర్ధన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయ మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. దేశవ్యాప్తంగా కొనసాగిన పాదయాత్రలో స్థానిక పరిస్థితులను ప్రజలు రాహుల్‌కు వివరించారన్నారు. గతంలో ఏ నాయకుడు ఇలాంటి యాత్ర చేపట్టలేదన్నారు. జోడో యాత్రతో కాంగ్రెస్‌కు ప్రజల్లో మరింత గుర్తింపు వస్తుందన్నారు. బీజేపీతో ప్రజలు విసుగు చెందారని సుస్థిరమైన పాలన కోసం కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, మహ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి

రాజేంద్రనగర్: రానున్న ఎన్నికల్లో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్లు రాజేంద్రనగర్ అసెంబ్లీ కోర్ కమిటీ సభ్యులు వెల్లడించారు. సోమవారం ఎనిమిది మంది సభ్యులతో కూడిన అసెంబ్లీ కోర్ కమిటీని నియమించారు. అసెంబ్లీ కన్వీనర్ పి.మల్లేష్‌యాదవ్, జాయింట్ కన్వీనర్ మహాలింగంగౌడ్, పాలక్ మర్రి శిధర్‌రెడ్డి, ప్రబారి సాయిప్రసాద్, డాక్టర్ ప్రేమ్‌రాజ్‌యాదవ్, టి.అంజన్‌కుమార్, నారగూడెం మల్లారెడ్డి, వై.శ్రీధర్ సభ్యులుగా ఉన్నారు. అనంతరం మాట్లాడుతూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రతి బస్తీలో కార్నర్ మీటింగ్స్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ, స్థానిక ఎమ్మెల్యే వైఫల్యాలను ఎండగడతామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దేశ ప్రజల ఐక్యత కోసమే భారత్ జోడో యాత్ర



గగన్‌పహాడ్‌లో జాతీయ జెండాను ఎగరవేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



మణికొండలో కాంగ్రెస్ జెండాను ఎగరవేసిన నాయకులు

రాజేంద్రనగర్: దేశ ఐక్యతకై రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర కొనసాగిందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. భారత్ జోడో యాత్ర ముగింపు సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ గగన్‌పహాడ్‌లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.ధనుంజయ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర నిర్వహించారన్నారు. పాదయాత్రలో ప్రజలను కలుస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దేశంలో, రాష్ట్రంలో అధికారం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జల్లపల్లి నరేందర్, బ్లాక్ అధ్యక్షులు మొహమ్మద్ ఖాలేద్, రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు కోరని బాల్‌రాజ్, శాస్త్రీపురం డివిజన్ అధ్యక్షులు మొహమ్మద్ తాజుద్దీన సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షులు ఇస్మాయిల్, సీనియర్ నాయకులు సాయిరెడ్డి, శ్రీరాములు, రాజ్‌కుమార్, సతీష్, పూల వెంకటేష్ ముదిరాజ్, సయ్యద్ ఉస్మాన్, బొల్లా వెంకటేష్, ఓంప్రకాష్, శ్రీనివాస్, కృష్ణ, తలారి రత్నం, వల్లూరి శ్రీశైలం, జోగి శ్రీనివాస్, పుస్తకాల అశోక్, సి.గంగయ్య, నిఖిల్, ముస్తాఫా, సుజాత, హరి, దయాకర్, సతీష్‌యాదవ్, మహేష్‌గౌడ్, గణేష్, సచిన్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణ

మణికొండ: కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత రాహుల్‌గాంధీ భారత్‌జోడోయాత్ర ముగింపు సందర్భంగా మణికొండ మున్సిపాలిటీ కేంద్రం, మర్రిచెట్టు కూడలిలో సోమవారం పార్టీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాహుల్‌గాంధీ పాదయాత్రతో దేశంలో పార్టీకి పూర్వవైభవం వస్తుందన్నారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు పురుషోత్తం, నాయకులు పద్మారావు, బి.ముత్యాలు, కిరణ్‌కుమార్, మల్లేష్, జితేందర్, శ్రీకాంత్‌రెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.